

# సదాశివపేటలో తాగునీటి సరఫరాపై సమీక్ష

- లీకేజీలు, పంపింగ్ సమస్యల పరిష్కారానికి ఆదేశం
- అవసరమైన చోట ట్యాంకర్లతో నీటి సరఫరా

**సదాశివపేట, ఏప్రిల్ 16 (జనం పవర్):** మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సరఫరా పరిస్థితిపై అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలకు నిరంతరంగా తాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ పరిష్కార చర్యలు అమలు చేయాలని ఆదేశించారు. పైప్‌లైన్ లీకేజీలు, పంపింగ్ సమస్యలు ఉన్న చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని నిర్ణయించారు.

### నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి

నీటి నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టి, శుద్ధి ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని అధికారులు సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# పోలీస్ కార్యాలయాల్లో 'నో హెల్మెట్-నో ఎంట్రీ'

- హెల్మెట్ ఉంటేనే కార్యాలయంలోకి అనుమతి
- డీసీపీ ఏ భాస్కర్ కీలక నిర్ణయం

**వేల్పుల నగేష్, జనం పవర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

మంచిర్యాల జిల్లాలోని డీసీపీ కార్యాలయంలో 'నో హెల్మెట్ ఉ నో ఎంట్రీ' కార్యక్రమం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ ఈ కార్యక్రమాన్ని అమలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఆయన సూచించారు. డీసీపీ కార్యాలయంతో పాటు మంచిర్యాల జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేసే సిబ్బంది హెల్మెట్ లేకుండా వస్తే ఆవరణలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

### భద్రతకు ప్రాధాన్యం

హెల్మెట్ వినియోగం కేవలం చట్టపరమైన నిబంధన కాదని.. వ్యక్తిగత భద్రతకు అత్యంత కీలకమని డీసీపీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా హెల్మెట్ వినియోగంపై కఠిన నియంత్రణలు అమలు చేస్తూ ప్రజల్లో రోడ్డు భద్రతపై బాధ్యతాయుత దృక్పథం పెంపొందించడం లక్ష్యంగా పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజలు తమ ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని.. ట్రాఫిక్ నియమాలు పాటించాలని అధికారుల పిలుపునిచ్చారు. భద్రతా నియమాలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో మరణాల ముప్పు తగ్గుతుందని వివరించారు.

# సర్కారు బడుల్లోనే నాణ్యమైన చదువు

- గుడిరేవు పాఠశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే
- విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన సెక్టోరల్ ఆఫీసర్ భరత్



**దండేపల్లి, ఏప్రిల్ 16 (జనం పవర్):** దండేపల్లి మండలంలోని గుడిరేవు గ్రామ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ భరత్.. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్తయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యమని భరత్ పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

### మురిసిపోయిన చిన్నారులు

ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రత్యేకమైన గ్రాడ్యుయేషన్ వస్త్రధారణలో మెరిసిపోయారు. నెత్తిపై గ్రాడ్యుయేషన్ టోపీలు ధరించి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు నేత్రపర్వంగా నిలిచారు. తమ పిల్లలు గ్రాడ్యుయేట్లలా కనిపిస్తుంటే తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మారుతున్న విద్యా ప్రమాణాలకు ఈ వేడుకలే నిదర్శనమని అతిథులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బుచ్చన్న.. ఉపాధ్యాయురాలు శ్యామల.. జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు మల్లూరు శ్రీనివాస్ పాల్గొన్నారు. వీరితో పాటు దండేపల్లి కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ (ఆర్పీ) గరిగ నరసయ్య.. తాళ్లపేట్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ రాజ మహమ్మద్.. వెలగనూరు రిసోర్స్ పర్సన్ రమేష్ హాజరయ్యారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప.. అంగన్వాడీ టీచర్ లక్ష్మి.. ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ ధనలక్ష్మి.. విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అధికారుల సమన్వయంతోనే ప్రభుత్వ లక్ష్యాల సాధన




### మండల ప్రత్యేక అధికారి పవన్ కుమార్

**బెజ్జంకి, ఏప్రిల్ 16 (జనం పవర్):** మండలంలో పనిచేస్తున్న అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని మండల ప్రత్యేక అధికారి పవన్ కుమార్ సూచించారు. సిద్దిపేట గృహ నిర్మాణ శాఖ పీడీగా పనిచేస్తున్న ఆయన బెజ్జంకి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యచరణ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా అధికారులు, మండల ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని పవన్ కుమార్ కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చూడాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితం కాకుండా.. సంక్షేమ ఫలాలు ప్రతి ఇంటికి చేరాలని సూచించారు. వార్డు సభ్యుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అధికారుల సహకారంతో ప్రజాప్రతినిధులు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆయన సూచించారు. 99 రోజుల పాటు చేపట్టబోయే ప్రత్యేక కార్యచరణపై ఈ సభలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ శ్రీకాంత్, మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ శాఖల అధికారులు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కాశీపూర్‌లో బసవ భవన్ వివాదం

### ప్రొసీడింగ్స్ ఉన్నా అడ్డుకుంటున్న గ్రామస్తులు
### స్పందించని అధికారులు.. సంఘ సభ్యుల ఆవేదన

**కంది, ఏప్రిల్ 16 (జనం పవర్):** కంది మండలం కాశీపూర్ గ్రామంలో బసవ భవన్ నిర్మాణం ఉద్రిక్తతకు దారితీసింది. జిల్లా కలెక్టర్ నుంచి ప్రభుత్వం జారీ చేసిన ప్రొసీడింగ్స్ ఉన్నప్పటికీ కొందరు గ్రామస్తులు పనులను అడ్డుకుంటున్నారు. ఈ భూమి తమదేనని వాదిస్తూ పనులకు వచ్చిన సంఘ సభ్యులను నిలదీశారు. మహిళలని చూడకుండా అసభ్య పదజాలంతో దూషించారని బాధితులు ఆరోపిస్తున్నారు. బసవ విగ్రహ స్థాపనకు వెళ్లిన సమయంలోనూ అడ్డంకులు సృష్టించడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఈ సమస్యపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్వయంగా అధికారులకు ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ స్థానిక అధికారులు స్పందించడం లేదని సంఘ సభ్యులు వాపోతున్నారు. ఇంద్రకరణ్ పోలీసుల నుంచి తమకు రక్షణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తహసీల్దార్ ఆదేశాలను సైతం లెక్కచేయకుండా సర్పంచ్ సహకారంతో కొందరు వ్యక్తులు పనులను అడ్డుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రొసీడింగ్స్ ప్రకారం భూమిని అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

# జైపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌డీఓ తనిఖీ

### విధులకు సమయానికి హాజరు కావాలని ఆదేశం
### పెండింగ్ ఫైళ్లను వెంటనే పూర్తి చేయాలి



**జైపూర్, ఏప్రిల్ 16 (జనం పవర్):** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ సిబ్బంది నిర్ణీత సమయానికి విధులకు హాజరు కావాలని స్పష్టం చేశారు. భూభారతి పెండింగ్ ఫైళ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకూడదని ఆదేశించారు. సాదాబైనామా దరఖాస్తులను ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం విచారణ చేసి పూర్తి చేయాలని ఆర్‌డీఓ ఆదేశించారు. ఫైళ్ల కదలికలో పారదర్శకత ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్ మండల తహసీల్దార్ రెడ్డి, డీడీ జనగామ సంతోష్, ఆర్ఐ అపర్ణ, తిరుపతి, జీపీఓ భారతి పాల్గొన్నారు. సిబ్బంది అంతా జవాబుదారీతనంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

# పద్మనాయక వెలమ సంఘం కోశాధికారిగా భీమ్ రావు

### 2026-28 కాలానికి ఏకగ్రీవ ఎన్నిక
### సహకరించిన వారందరికీ ధన్యవాదాలు



**కరీంనగర్, ఏప్రిల్ 16 (జనం పవర్):** పద్మనాయక వెలమ సంఘం ఎన్నికల్లో (2026-28) కోశాధికారిగా నిమ్మనేని భీమ్ రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు. కుల బాంధవులందరి సహకారంతో ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నూతన కోశాధికారిగా ఎన్నికైన నిమ్మనేని భీమ్ రావు ఈ సందర్భంగా వెలమ కుల బంధువులకు, పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన శ్రేయోభిలాషులు, మిత్రులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

# జమ్మికుంట, కమలాపూర్ ఆసుపత్రులకు డయాలసిస్ సెంటర్లు

### వొడితల ప్రణవ్ కృషితో పేదలకు అందిన వరం
### వైద్య ఆరోగ్య శాఖ నుంచి అధికారిక ఉత్తర్వులు

**జమ్మికుంట, ఏప్రిల్ 16 (జనం పవర్):** పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట, కమలాపూర్ ప్రభుత్వ దవాఖానలకు డయాలసిస్ సెంటర్లను మంజూరు చేసింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలోనే జమ్మికుంట, హుజూరాబాద్ ఆసుపత్రులకు 30 లక్షల రూపాయలు కేటాయించగా.. తాజాగా డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుతో కిడ్నీ రోగులకు పెద్ద ఊరట లభించనుంది.



### ప్రణవ్ వినతికి మంత్రి సానుకూలత

స్థానిక పేద ప్రజలు డయాలసిస్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్ల పడుతున్న ఇబ్బందులను హుజూరాబాద్ కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్ గుర్తించారు. ఈ సమస్యను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ప్రణవ్ విన్నపానికి సానుకూలంగా స్పందించిన మంత్రి.. ఈ రెండు కేంద్రాలను మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుతో స్థానిక పేదలకు వ్యయప్రయాసలు తప్పుతాయని బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డయాలసిస్ కేంద్రాల మంజూరుపై వొడితల ప్రణవ్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు జిల్లా మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు విద్య, వైద్యం అందించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని.. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# గల్ఫ్ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**అనారోగ్యంతో మృతి చెందిన మోతే నాగరాజు**

**నిరుపేద కుటుంబానికి గల్ఫ్ అసోసియేషన్ భరోసా**



**దండేపల్లి, ఏప్రిల్ 16 (జనం పవర్):** దండేపల్లి మండలంలోని తాళ్లపేట గ్రామానికి చెందిన గల్ఫ్ సభ్యుడు మోతే నాగరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నాగరాజుది అత్యంత నిరుపేద కుటుంబం కావడంతో 'గల్ఫ్ అసోసియేషన్ తాళ్లపేట' సభ్యులు మానవత్వం చాటుకున్నారు. ఆ కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ అసోసియేషన్ సభ్యులు నజీర్, సంథాని, మహమ్మద్ షరీఫ్, కోట రవి, ముల్కాల గౌరయ్య, రాజేందర్, ఆలిం పాల్గొన్నారు. ఆపదలో ఉన్న తోటి సభ్యుడి కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఆ కుటుంబానికి భవిష్యత్తులోనూ తమ వంతు సహకారం అందిస్తామని సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు.

# సీనియర్ అసిస్టెంట్ సుజాతకు ఘన సన్మానం

**సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ**

**తొమ్మిదేళ్ల సేవలను గుర్తుచేసుకున్న రెవెన్యూ సిబ్బంది**



**బెజ్జంకి, ఏప్రిల్ 16 (జనం పవర్):** బెజ్జంకి మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సుజాత సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తో పాటు రెవెన్యూ సిబ్బంది సుజాతను ఘనంగా సన్మానించారు. శాలువాతో కప్పి జ్ఞాపికను అందజేసి వీడ్కోలు పలికారు. గత తొమ్మిది సంవత్సరాలుగా బెజ్జంకి రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందినట్లు అధికారులు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. విధి నిర్వహణలో ఆమె చూపిన నిబద్ధతను తోటి ఉద్యోగులు కొనియాడారు. బదిలీపై వెళ్తున్న ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

**21న సిద్దిపేటలో మిల్లెట్స్ ఫుడ్ ఫెస్టివల్**

**వాల్ పోస్టర్ ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల**



**సిద్దిపేట, ఏప్రిల్ 16 (జనం పవర్):** సిద్దిపేటలో పెరుగుతున్న కాలుష్య పరిస్థితులను తట్టుకుని ఆరోగ్యంగా ఉండేందుకు పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారం ఎంతో అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల పేర్కొన్నారు. గురువారం సాయంత్రం సిద్దిపేట ఎన్జీవో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మిల్లెట్స్ ఫుడ్ ఫెస్టివల్ వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ, ఎన్జీవో భవన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించనున్న ఈ ఉత్సవాన్ని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆరోగ్య సిద్దిపేట లక్ష్యంగా ఎమ్మెల్యే హరీష్ రావు చేస్తున్న కృషికి ఈ ఫెస్టివల్ తోడ్పడుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

### మిల్లెట్స్ రాంబాబు వంటకాల ప్రదర్శన

సొసైటీ అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 21న సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత పోషకాహార నిపుణులు మిల్లెట్స్ రాంబాబు పాల్గొంటారని తెలిపారు. వివిధ రకాల మిల్లెట్స్ వంటకాలను తయారు చేసి ప్రదర్శించడంతో పాటు వాటి ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా సిద్దిపేట ప్రాంత మహిళలు తయారు చేసే పోషక విలువలు గల వివిధ వంటకాల ప్రదర్శన ఉంటుందని.. పాల్గొన్న వారికి బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ప్రముఖ యోగా గురువు తోట సతీష్ మాట్లాడుతూ.. యోగా, ధ్యానంతో పాటు ఆరోగ్యకర ఆహారం మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు. ఎన్జీవో భవన్ అధ్యక్షులు సామల నాగభూషణాచార్య మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ ఆహారాల్లో ఉన్న విలువలను ప్రజలకు గుర్తు చేయడమే ఈ ఉత్సవాల ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎస్డబ్ల్యూఏ అధ్యక్షులు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి విక్రమ్ రెడ్డి, కోశాధికారి కళ్లపల్లి శ్రీనివాస్, అయిత అంజయ్య పాల్గొన్నారు. వీరితో పాటు వ్యాస మహర్షి యోగా సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్ కుమార్, అధ్యక్షులు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, యోగా శిక్షకులు తోట సతీష్, సంధ్య, అశోక్, ప్రభాకర్, లింగమూర్తి, స్వామి, సురేష్, గంగాపురం శ్రీనివాస్, మంజుల పాల్గొన్నారు.





# ఎండల దృష్ట్యా చలివేంద్రాల ఏర్పాటు

- ముదిగుంట, నర్వ సర్పంచుల చొరవ
- ప్రజల దాహార్తి తీర్చేందుకే ఈ ఏర్పాటు

**జైపూర్, ఏప్రిల్ 16 (జనం పవర్):** జైపూర్ మండలం ముదిగుంట, నర్వ గ్రామ పంచాయతీల్లో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. సర్పంచులు ఆకుల రవీందర్, ఆగిడి స్రవంతి లింగన్న ఆధ్వర్యంలో నర్వ రోడ్డు తో పాటు రసూల్‌పల్లి బస్టాండ్ వద్ద వీటిని ప్రారంభించారు. వేసవి తీవ్రత దృష్ట్యా బాటసారులకు, స్థానికులకు చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఎండలో ప్రయాణించే వారికి దాహార్తి కలగకుండా ఈ చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని సర్పంచులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అర్హులైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్లు ఇప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామగిరి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.





# ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన

- జైపూర్‌లో 99 రోజుల ప్రగతి ప్రణాళిక సభ
- పథకాల అమలుపై అధికారుల నివేదికలు

**జైపూర్, ఏప్రిల్ 16 (జనం పవర్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై జైపూర్ రైతు వేదికలో మండల స్థాయి సభ నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి, రాజస్వ మండలాధికారి జి. శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. సభలో ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారులు చదివి వినిపించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న లబ్ధిని, భవిష్యత్తు కార్యాచరణను ఈ సందర్భంగా వివరించారు. ఈ ప్రణాళిక ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

### సంక్షేమ ఫలాలే లక్ష్యం

అన్ని శాఖల మండల అధికారులు తమ పరిధిలో సాగుతున్న అభివృద్ధి పనుల ప్రగతి నివేదికలను సభకు సమర్పించారు. ప్రభుత్వ పథకాల అమలుపై సర్పంచులు తమ అభిప్రాయాలను, సూచనలను తెలియజేశారు. సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలనే లక్ష్యంతో ఈ ప్రణాళిక అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. గ్రామ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ప్రజాప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి. సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందుపట్ల పాపి రెడ్డి, తహసీల్దార్ వనజా రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు ఎంపీఓ శ్రీపతి బాపు రావు, పీఆర్ ఏఈ బి. రాజ్ కుమార్, ఏఈఈ ఆర్డబ్ల్యూఎస్ ఆర్. మహేందర్, మండల వ్యవసాయాధికారి శివ లీల, మెడికల్ ఆఫీసర్ ముస్తఫా పాల్గొన్నారు. అలాగే మండల విద్యాధికారి బి. శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజ, ఏఈ హౌసింగ్ కాంక్ష, ఏపీఓ బి. బాలయ్య, డీఆర్డీఏ సీసీ రాజన్న తో పాటు సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, రోడ్డు భద్రత కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎస్ హెచ్ జీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరాలి

**అభివృద్ధి లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలి**

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడి**

**వేల్పుల నగేష్, జనం పవర్- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**

ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా అధికారులు అందరూ కలిసి పనిచేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం చెన్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సభకు ఆయన హాజరయ్యారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమంలో భాగంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఉత్పత్తులను సేకరిస్తున్నామని.. సన్నరకం వడ్లకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు.

### ఇందిరమ్మ ఇళ్లు.. పింఛన్ల మంజూరు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో దాదాపు 3 వేల 500 ఇళ్లు స్లాబ్ స్థాయి వరకు పూర్తయ్యాయని కలెక్టర్ వెల్లడించారు. ఇళ్లు రాని అర్హులు దరఖాస్తు చేసుకుంటే మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే ఉచిత ఇసుకను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కల్యాణ లక్ష్మి పథకంలో అర్హులందరికీ నగదు అందజేస్తామని.. జిల్లాలో వచ్చిన 9 వేల పింఛన్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం మంజూరు చేస్తామని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలిస్తామన్నారు.

### విద్య, వైద్య రంగాల బలోపేతం

చెన్నూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి సిద్ధంగా ఉందని.. 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులు తుది దశకు చేరుకున్నాయని కలెక్టర్ వివరించారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరిగిందని.. 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల ద్వారా వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేసి శుద్ధమైన తాగునీరు అందిస్తున్నామన్నారు. డైట్ చార్జీలు పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. చెన్నూర్ పట్టణంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, సౌర విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

### మహిళా సాధికారత.. రహదారి భద్రత

'ఇందిరా మహిళా శక్తి' పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సీఐ బన్సీలాల్ తో కలిసి 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో వెళ్లేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అంతకుముందు కలెక్టర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అమృత్ 2.0 పథకంలో నిర్మిస్తున్న నీటి ట్యాంకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ వెంకటేశ్వర్ రావు, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ మోహన్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మహేష్ ప్రసాద్ తివారి పాల్గొన్నారు.



# అందని 'ఆసరా'.. అభాగ్యుల గోస

- ఉమ్మడి జిల్లాలో వేల సంఖ్యలో ఎదురుచూపులు
- నెలలు గడుస్తున్నా తెరుచుకోని ఆన్‌లైన్ పోర్టల్



తుడుం జితేందర్ -జనం పవర్ -ఉత్తర తెలంగాణ బ్యూరో:

ఒకరికి కళ్లు కనిపించవు.. మరొకరికి నడక సాగదు.. ఇంకొకరికి ఆసరా ఇచ్చే తోడు లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాల నుంచి పట్టణాల వరకు అభాగ్యుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం ఇచ్చే 'ఆసరా' పింఛనే వీరికి జీవనాధారం. కానీ నెలలు గడుస్తున్నా.. ఏళ్లు మారుతున్నా కొత్త పింఛన్ల రాక మాత్రం కలగానే మిగిలిపోతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల నుంచి 50 వేల మంది కొత్త పింఛన్ల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలు విని తమ కష్టాలు తీరుతాయని ఆశపడ్డ వృద్ధులకు ఇప్పుడు నిరాశే ఎదురవుతోంది.

### నిలిచిన ఆన్‌లైన్ దరఖాస్తులు

కొత్తగా దరఖాస్తు చేసుకుందామంటే ఆసరా ఆన్‌లైన్ పోర్టల్ విండో తెరుచుకోవడం లేదు. మీ-సేవ కేంద్రాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా ఫలితం ఉండటం లేదు. బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించినట్లు రికార్డులు చెబుతున్నా.. ఆ నిధులు కొత్త లబ్ధిదారులకు ఎప్పుడు అందుతాయనే దానిపై స్పష్టత లేదు. గతంలో పింఛన్ తీసుకుంటూ మరణించిన వారి స్థానంలోనైనా కొత్తవారికి అవకాశం ఇవ్వాలని జనం కోరుతున్నారు. కానీ ఆ ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతోంది.

### ఏడాదిగా ఎదురుచూపులే

నిర్మల్ జిల్లాకు చెందిన రాజవ్వ అనే వృద్ధురాలి ఆవేదన క్షేత్రస్థాయి పరిస్థితికి అద్దం పడుతోంది. "కొడుకులు పట్టించుకోరు.. ఉన్న రెండెకరాల భూమి సాగు చేయలేను.. పింఛన్ వస్తే మందు బిళ్లలకైనా పనికొస్తుందని ఏడాది నుంచి ఎదురుచూస్తున్నా.. ఆఫీసులకు వెళ్తే లింక్ రావాలి అంటున్నారు" అని ఆమె వాపోతోంది. ఆ లింక్ ఎప్పుడు వస్తుందో.. తమకు ప్రాణం ఎప్పుడు లేచి వస్తుందో అని అభాగ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వం ముందున్న డిమాండ్లు

సామాజిక భద్రతకు పరీక్షగా మారిన ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది. వెంటనే ఆన్‌లైన్ దరఖాస్తులను పునరుద్ధరించాలని.. గ్రామ సభల ద్వారా అర్హులైన వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులను ఎంపిక చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి అభాగ్యులకు అండగా నిలవాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటనల నుంచి ఆచరణలోకి అడుగులు వేయాలని 'ఉమ్మడి' జనం ఆశిస్తున్నారు.

# మనుషుల ప్రాణాల కంటే కుక్కలే ఎక్కువనా?

## జన్నారంలో కుక్కల స్వైరవిహారం.. జనం బేజారు



అధికారుల మౌనంపై మండల నాయకుల ఆగ్రహం

- మండలంలో వరుస దాడులతో ప్రజల వణుకు
- గర్భిణీలు, వృద్ధులపై పడుతున్న మూగజీవాలు
- జంతువులను చంపితే కేసులని అధికారుల భయం
- పిల్లలను బడికి పంపాలంటే తల్లిదండ్రుల ఆందోళన




తుడుం జితేందర్-జనం పవర్-ఉత్తర తెలంగాణ బ్యూరో

జన్నారం మండలంలో కుక్కల రాజ్యం నడుస్తోంది. చింతలపల్లి, కవ్వాల్, రేండ్లగూడ, బాదంపల్లి, దేవుని గూడా, పోన్కల్, కిష్టాపూర్ గ్రామాల్లో ప్రజలు అడుగు బయట పెట్టాలంటే ప్రాణభయంతో వణికిపోతున్నారు. మనుషుల రక్తం ఓడుతున్నా యంత్రాంగం కదలడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణీ అని కూడా చూడకుండా మెట్టుపల్లి గంగజలపై కుక్క దాడి చేయడం స్థానికులను కలిచివేస్తోంది. ఇంటి ముందు ఊడుస్తున్న జయవ్వ, తన మనవడిని కాపాడబోయిన వృద్ధుడు రాజన్న, అలాగే శ్రీరామ్, పుష్పలత వరుస దాడులతో ఆసుపత్రుల పాలయ్యారు.

### మనుషుల కంటే కుక్కలకే ప్రాధాన్యమా?

గ్రామాల్లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తుంటే వాటిని బంధించే నాథుడే కరువయ్యాడు. కుక్కలను కొట్టినా.. చంపినా తమపై కేసులు పెడతారని సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యదర్శులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. గతంలో కిష్టాపూర్‌లో కుక్క చనిపోతే కేసులు పెట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మనుషుల ప్రాణాలు పోతుంటే కేసులు ఎవరిపై పెట్టాలని గ్రామ పెద్దలు ప్రశ్నిస్తున్నారు. జంతు సంరక్షణ చట్టాలు మనుషుల ప్రాణాలను బలితీసుకోవడానికేనా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



### అధికారుల మౌనం.. ప్రజల ఆందోళన

పిల్లలను బడికి పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా గ్రామాల్లో జనం కర్రలు పట్టుకుని కాపలా కాస్తున్నారు. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా జిల్లా కలెక్టర్ గానీ, ఉన్నతాధికారులు గానీ క్షేత్రస్థాయికి రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిచ్చికుక్కలను బంధించే బాధ్యత ఎవరిదని నాయకులు నిలదీస్తున్నారు. బాధితులకు వైద్య ఖర్చులు, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే జన్నారం మండలంలో జరిగే అనర్థాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.



# దోమల నివారణతోనే వ్యాధుల కట్టడి

- 99 రోజుల ప్రగతి ప్రణాళికపై కలెక్టర్ సమీక్ష
- ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు ప్రత్యేక కార్యాచరణ
- మురుగు కాలువలు, నిల్వ నీటి తొలగింపునకు ఆదేశం



నగేష్, జనం పవర్ -ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,

వ్యాధుల నియంత్రణలో భాగంగా దోమల వృద్ధిని అరికట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు జిల్లాలో వెక్టర్-బోర్న్ వ్యాధుల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించేందుకు వైద్య శాఖ చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో గుంతలు పూడ్చడం, మురుగు కాలువలు శుభ్రపరచడం, నిల్వ నీటిని తొలగించడం వంటి పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాల్లో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే లోపే పాఠశాలలను శుభ్రం చేసి, దోమల మందు పిచికారీ చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో మందులు, ద్రావణాలు, పడకలు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని.. క్షేత్రస్థాయి సిబ్బంది రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు

వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని.. ఆ సమయంలో బయటకు రాకుండా చూడాలని తెలిపారు. అన్ని గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని.. ప్రజలు తెల్లటి నూలు దుస్తులు, గొడుగు, టోపీలు ధరించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ అనిత, డీపీఓ వెంకటేశ్వర్ రావు, మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, డాక్టర్ వేదవ్యాస్, టీ-హబ్ ప్రతినిధి డాక్టర్ శిల్ప పాల్గొన్నారు.

# జన్నారం అభివృద్ధికి 99 రోజుల ప్రణాళిక

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
- జన్నారాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దాలి
- రైతు వేదికలో 29 గ్రామాల ప్రతినిధులతో సమీక్ష
- అభివృద్ధి ఫలితాలు ప్రతి ఇంటికీ చేరాలి
- వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- యుద్ధప్రాతిపదికన మౌలిక వసతుల కల్పన



తుడుం జితేందర్ జనం పవర్ ఉత్తర తెలంగాణ బ్యూరో

మండల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ ఉమర్ షరీఫ్ పిలుపునిచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేసి జన్నారాన్ని జిల్లాలోనే ఆదర్శంగా నిలపాలని కోరారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 29 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యదర్శులతో భారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గ్రామాల్లో 99 రోజుల పాటు చేపట్టే ప్రత్యేక కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. అభివృద్ధి ఫలితాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి ఇంటికీ చేరేలా చూడాలని అధికారులు సూచించారు. గ్రామ వార్డు సభ్యుడి నుంచి ఉన్నతాధికారి వరకు అందరూ ఒకే లక్ష్యంతో పనిచేయాలని నిర్ణయించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం వస్తున్నందున డ్రైనేజీలు, వీధుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచులు, కార్యదర్శుల మధ్య అవగాహనతో పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 29 పంచాయతీల ప్రతినిధులు, ఎస్ఐ ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచులు ఈ సందర్భంగా తెలిపారు.







# రోడ్డు భద్రతా నియమాలతోనే ప్రాణాలకు రక్షణ

## అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా చేతుల మీదుగా ప్రారంభం

డ్రైవింగ్ నియమాలపై ఆటో, బస్సు డ్రైవర్లకు అవగాహన

సీపీ రష్మి పెర్మాల్ ఆధ్వర్యంలో భద్రతా సూచనలు

డ్రైవర్లకు కంటి పరీక్షలు.. హెల్మెట్ల పంపిణీ

ప్రాణ రక్షణ కోసం డాక్టర్ల చేత సీపీఆర్ ప్రదర్శన

### ట్రాఫిక్ నిబంధనల పాటింపుపై పోలీసుల ప్రతిజ్ఞ



**జనం పవర్ - సిద్దిపేట ప్రతినిధి**

సిద్దిపేట జిల్లాలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా సీపీ రష్మి పెర్మాల్ కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లు, లారీ డ్రైవర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డ్రైవింగ్ చేసే సమయంలో పాటించాల్సిన కనీస నియమాలు, ట్రాఫిక్ నియంత్రణ పద్ధతులు, మద్యం సేవించి వాహనం నడపడం వల్ల కలిగే అనర్థాలపై అధికారులు అవగాహన కల్పించారు.

### కంటి పరీక్షలు.. సీపీఆర్ ప్రదర్శన

ప్రమాదాలను తగ్గించేందుకు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరని అధికారులు సూచించారు. సీనియర్ డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి చికిత్స అందించారు. ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ప్రమాద సమయాల్లో ప్రాణాలను ఎలా కాపాడాలో డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో డాక్టర్లు సీపీఆర్ విధానాన్ని ప్రదర్శించి చూపారు. అత్యవసర పరిస్థితుల్లో గుండెకు మళ్ళీ శ్వాస అందించే ప్రక్రియపై డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు.

### నియమాలు పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం

హెల్మెట్ ధరించడమే కాకుండా దాన్ని సరిగ్గా లాక్ చేసుకోవడం అత్యవసరమని జిల్లా సీపీ పేర్కొన్నారు. సీట్ బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు. సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతమైంది.





